www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
శనివారం
19 ఏప్రిల్ 2025




# రూ.10,500 కోట్లు

## ఎన్‌టీటీ డేటా, నెయిసా సంయుక్త పెట్టుబడులు

- పెట్టుబడులతో రండి : సీఎం రేవంత్ రెడ్డి పిలుపు
- హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్
- 500 మెగావాట్ల వరకు గ్రిడ్, పునరుత్పాదక విద్యుత్తు మిశ్రమంతో క్లస్టర్ నిర్మాణం
- రాష్ట్ర డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌కు దోహదం
- తెలంగాణలోని విద్యా సంస్థల భాగస్వామ్యంతో ఏఐ ప్రతిభ పెంపు
- టోక్యోలో తెలంగాణ రైజింగ్ బృందం త్రైపాక్షిక ఒప్పందం
- దేశంలో అతిపెద్ద ఏఐ కంప్యూట్ మౌలిక సదుపాయం

2లో






## భగవద్గీత, నట్యశాస్త్రానికి యునెస్కో గౌరవం

### భారతీయ సంస్కృతి దక్కిన గౌరవం

### తాత్వీక వారసత్వానికి ప్రతిక

న్యూఢిల్లీ: యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు తార్కాణంగా పిలిచే పవిత్ర గ్రంథం భగవద్గీత, భరతముని రచించిన నాట్యశాస్త్రాలకు చోటు దక్కింది. భారత దేశ సంస్కృతి, చారిత్రక, తాత్విక వారసత్వానికి ప్రతీకలుగా గుర్తిస్తూ యునెస్కో ఈ గౌరవాన్ని కల్పించింది. ఈ విషయాన్ని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు.

# రైతుల మేలు కోసమే కొనుగోలు కేంద్రాలు

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

కలంజ్యోతి, నిర్మల్: రైతుల మేలు కోసమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారని, వీటిని వినియోగించుకుని రైతులు గిట్టుబాటు ధరలు పొందాలని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ లో ఎఫ్ ఎస్ సీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏలేటి ప్రారంబించారు. నిర్మల్ నియోజకవర్గంలోని రైతులందరూ ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కనీస మద్దతు ధర రూ.3371 లు ఉందని, రైతులందరూ తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి లబ్ధి పొందాలని సూచించా కార్యక్రమంలో బీజేపీ నాయకులు రావుల రాంనా మెడిసెమ్మ రాజు, ఆకుల కార్తీక్, సుంకరి సాయి, నవీన్, నరేందర్, పద్మాకర్, తో పాటు ధర్మాజీ రాజేందర్, భీమ్ రెడ్డి, రైతులు, మండల బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. సారంగాపూర్ మండలం ఆలూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, సారంగాపూర్ లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.



# రూ.10,500 కోట్లు

## ఎన్‌టీటీ డేటా, నెయిసా సంయుక్త పెట్టుబడులు

**కలంజ్యోతి, హైదరాబాద్ :** డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్, ఐటీ సర్వీసుల్లో ప్రపంచంలో పేరొందిన ఎన్‌టీటీ డేటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫస్ట్ క్లౌడ్ ఫ్లాట్‌ఫాం సంస్థ నెయిసా నెట్ వర్క్స్ సంయుక్తంగా హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చాయి. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి దాదాపు రూ. 10,500 కోట్ల పెట్టుబడితో ఈ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు త్రైపాక్షిక ఒప్పందం (ఎమ్ఓయూ) కుదుర్చుకున్నాయి. టోక్యోలో శుక్రవారం జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ పెట్టుబడుల ఒప్పందం కుదిరింది. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ఎన్‌టీటీ డేటా, నెయిసా నెట్‌వర్క్స్ నుంచి బోర్డు సభ్యుడు కెన్ కట్సుయామా, డైరెక్టర్ తడావోకి నిషిమురా, ఎన్టీటీ గ్లోబల్ డేటా సెంటర్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ బజ్‌పాయ్, నెయిసా సీఈవో, ఎన్టీటీ గ్లోబల్ డేటా ఛైర్మన్ షరద్ సంఘీ ఈ ఒప్పందంలో పాల్గొన్నారు. కాగా టోక్యోలో ప్రధాన కార్యాలయం కలిగిన ఎన్‌టీటీ డేటా, ఐటీ సేవలు, డేటా సెంటర్లు, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ లో పేరొందిన ఈ కంపెనీ 50 కంటే ఎక్కువ దేశాల్లో కొనసాగుతున్నది. 1,93,000 మంది ఉద్యోగులతో ప్రపంచంలోని టాప్ 3 డేటా సెంటర్ ప్రొవైడర్లలో ఒకటిగా నిలిచింది. పబ్లిక్ సర్వీసెస్, బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్, మాన్యుఫాక్చరింగ్, టెలికాం వంటి రంగాలకు ఈ సంస్థ సేవలు అందిస్తున్నది.అలాగే నెయిసా నెట్ వర్క్ ఏఐఫస్ట్ క్లౌడ్ ఫ్లాట్‌ఫాం సంస్థ, నిర్దిష్ట ఏఐ కంప్యూట్ సొల్యూషన్స్ ను అందించటంపై దృష్టి సారిస్తుంది.

**దేశంలో అతిపెద్ద ఏఐ కంప్యూట్ మౌలిక సదుపాయం**

హైదరాబాద్‌లో నిర్మించబోయే ఈ సదుపాయం 400 మెగావాట్ల డేటా సెంటర్ క్లస్టర్. 25,000 జీపీయూలతో దేశంలోనే అత్యంత శక్తివంతమైన ఏఐ సూపర్ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను సమకూరుస్తుంది. దేశంలో తెలంగాణను అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాజధానిగా మార్చాలనే లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటుంది. ఎన్‌టీటీ డేటా, నెయిసా కంపెనీలు సంయుక్తంగా ఏఐఫస్ట్ సొల్యూషన్స్ను అభివృద్ధి చేసేందుకు ఈ క్లస్టర్ కొత్త ఆవిష్కరణల కేంద్రంగా అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. 500 మెగావాట్ల వరకు గ్రిడ్, పునరుత్పాదక విద్యుత్ మిశ్రమంతో ఈ క్లస్టర్ నిర్మిస్తారు. లిక్విడ్ ఇమ్మర్షన్ వంటి అత్యాధునిక కూలింగ్ టెక్నాలజీలను అవలంభిస్తారు. ఈ ప్రాజెక్ట్ ను అత్యున్నత ఈఎస్‌జీ (ఎన్విరాన్‌మెంటల్, సోషల్, గవర్నెన్స్) ప్రమాణాలతో అభివృద్ధి చేస్తారు. ఈ



క్యాంపస్ తెలంగాణలోని విద్యా సంస్థల భాగస్వామ్యంతో ఏఐ ప్రతిభను పెంపొందిస్తుంది. రాష్ట్ర డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌కు దోహదం చేస్తుంది. ఎడబ్ల్యూఎస్, ఎస్‌టీటీ, టిల్‌మన్ హోల్డింగ్స్, సీటీఆర్ఎల్ఎస్ వంటి పెద్ద కంపెనీల డేటా సెంటర్ ప్రాజెక్టుల వరుసలో ఎన్‌టీటీ భారీ పెట్టుబడుల ఒప్పందంతో దేశంలో ప్రముఖ డేటా సెంటర్ హబ్ గా హైదరాబాద్ స్థానం మరింత బలపడిందన్నారు.


**పెట్టుబడులతో రండి..**

తెలంగాణలో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జపాన్ పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశంలోనే కొత్త రాష్ట్రమైన తెలంగాణ అత్యంత వేగంగా వృద్ధి చెందుతోందని వివరించారు. అభివృద్ధిలో దూసుకెళ్తోన్న తమ రాష్ట్రం జపాన్ పారిశ్రామిక వేత్తలకు స్వాగతం పలుకుతుందని చెప్పారు. జపాన్‌ను ఉదయించే సూర్యుడి దేశం అని పిలుస్తారనీ తమ ప్రభుత్వ నినాదం కూడా 'తెలంగాణ రైజింగ్' అని అభివర్ణించారు. టోక్యోలోని హోటల్ ఇంపీరియల్‌లో జరిగిన ఇండియాజపాన్ ఎకనామిక్ పార్టనర్‌షిప్ రోడ్‌షోలో తెలంగాణ రాష్ట్ర అధికారిక బృందం రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించింది. ఈ రోడ్ షోలో రేవంత్ రెడ్డి.. పరిశ్రమల స్థాపన కోసం తెలంగాణలో ఉన్న వనరులు, అనుకూల పరిస్థితులను వివరించారు. పెట్టుబడులతో వస్తే అన్ని రకాలుగా సహాయసాకారాలు అందిస్తామని జపాన్ పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చారు. టోక్యో చాలా గొప్ప నగరమని చెప్పారు. ఇక్కడి మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, ఆవిష్కరణలు అద్భుతమని కొనియాడారు. జపాన్ ప్రజలు సౌమ్యులు, మర్యాదస్తులు, క్రమశిక్షణ కలిగిన వారని కీర్తించారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడానికి టోక్యో నుంచి చాలా నేర్చుకున్నానని సీఎం జపాన్ పారిశ్రామిక వేత్తలకు వివరించారు. లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కెపాబులిటీ సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, టెక్స్ టైల్స్, ఏఐ డేటా సెంటర్లు, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. భారత్, జపాన్ కలిసికట్టుగా ప్రపంచానికి అద్భుతమైన భవిష్యత్తును నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భారత రాయబారి సిబి జార్జ్ భారత్‌జపాన్ మధ్య బలపడుతున్న ఆర్థిక సంబంధాలను వివరించారు. జెట్రో (జపాన్ ఎక్స్టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) బెంగళూరు డైరెక్టర్ జనరల్ తోషిహిరో మిజుటానీ మాట్లాడుతూ.. తెలంగాణతో సహకారాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కాగా దేశంలోనే మొదటి నెట్ జీరో ఇండస్ట్రియల్ సిటీగా హైదరాబాద్లో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ, దేశంలోనే అద్భుతంగా నిర్మించ తలపెట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ పై ప్రచార వీడియోలను రాష్ట్ర ప్రభుత్వం ఈ వేదికపై ప్రదర్శించింది. అలాగే ఎలక్ట్రానిక్స్, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, టెక్స్‌టైల్స్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో జపాన్ కంపెనీలకు తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, అవకాశాలను రాష్ట్ర వాణిజ్య పరిశ్రమల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ వివరించారు. రోడ్‌షో తర్వాత తెలంగాణ ప్రతినిధి బృందం, జపాన్‌లోని పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి సమావేశమైంది. వివిధ రంగాలకు చెందిన దాదాపు 150 మందికి పైగా జపాన్ పారిశ్రామికవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




## అంజన్న దర్శించుకున్న హైకోర్టు సూపరింటెండెంట్

**కలంజ్యోతి, మల్యాల :** కొండగట్టు శ్రీఆంజనేయ స్వామిని హైకోర్టు సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. స్వామి వారికీ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వదిస్తూ, తీర్థ ప్రసాదాలు అందజేశారు.



## కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**కలంజ్యోతి, మల్యాల :** మండలంలోని ముత్యంపేట, సర్వపూర్, బల్వంతపూర్ గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘము ఆధ్వర్యంలో పీఏసీఎస్ చైర్మన్ రాంలింగారెడ్డి, ఏఎంసీ చైర్ పర్సన్ మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్ తో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణచారి, ప్రకాష్ రెడ్డి, మారుతీ, మ్యాక లక్ష్మణ్, మారుతీ రైతులు పాల్గొన్నారు.



## కులవృత్తులు అండగా ప్రభుత్వం

### ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**కలంజ్యోతి, జగిత్యాల :** కుల వృత్తులకు కేసీఆర్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ జగిత్యాల జిల్లా శాఖ విశ్వకర్మలకు కుటీర పరిశ్రమల కింద గుర్తించి ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్వకర్మలకు 25 హెచ్ పీ వరకు కెపాసిటీ గల విద్యుత్ వాడుకునే విధంగా రూపకల్పన చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదములు తెలుపుతూ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిసి ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్తు జిల్లా అధ్యక్షుడు చింతల రాజేశ్వర్, కార్యదర్శి, శివనూరి రాకేష్, సాయి, రంజిత్, నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉపాధిహామీ కూలీల సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

## మాజీ మంత్రి జీవన్‌రెడ్డి





**కలంజ్యోతి, జగిత్యాల :** ఉపాధి హామీ కూలీల స మస్య పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. ఉపాధి హామీ కూలీల సమస్యలపై కలెక్టర్ కు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానన్నారు. బీర్పూర్ మండల పర్యటనలో భాగంగా సారంగపూర్ మార్గమధ్యలో లక్ష్మీదేవి పల్లె శివారులో ఉపాధిహామీ కూలీలను గమనిం చిన జీవన్ రెడ్డి వారితో కలిసి మాట్లాడారు. కూలీలు వారికి రోజు పని కనిపించేలా చూసి బస్ ఆగేలా సౌకర్యం కల్పించాలని కూలీలు జీవన్ రెడ్డిని కొరగా, విషయం తెలుసుకున్న ఆయన అధికారులతో మాట్లాడారు. రోజు పని ఎందుకు కల్పించలేక పోతున్నారో పూర్తి వివరాలు తెలుసుకున్నారు. పలు సమస్యల నెపంతో కూలీలకు పని కల్పించకపోవడం ఏంటిని అడిగారు. అవసరం అయితే మెయిన్టైనర్లను పెంచాలని సూచించారు. ఉన్నత అధికారులతో మాట్లాడి పరిస్థితి వివరించారు. ఉపాధి కూలీలకు ప్రతి రోజు పని కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే కూలీలకు బస్ సౌకర్యం కోసం రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేసి వారికి బస్ సౌకర్యం కల్పించేలా చూసి, వారికి సమ్మర్ అలియన్స్ 30శాతం కల్పించాలని కోరారు. ఈ సమస్యల పై జిల్లా కలెక్టర్కు లేఖ రాస్తానని తెలిపారు. అనంతరం సారంగపూర్ మండల కేంద్రంలో మీడియా సమావేశంలో జీవన్ రెడ్డి మాట్లాడుతూ... ఉపాధి హామీ కూలీలకు 100 రోజులు పని కల్పించడం ప్రభుత్వం బాధ్యతన్నారు. ఉపాధి హామీ కూలీల సమస్యలపైన కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడంతో పాటు స్వయంగా వెళ్లి వారి సమస్యలను వివరిస్తానన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సారంగపూర్ మండల అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, కొక్కు గంగారాం, ఉపేందర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

# పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు ఘన సన్మానం





**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** ఎంతో ఘన చరిత్ర గల పుల్లాస్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సన్మాన సభ ఆద్యాంతం ఆహ్లాదకరంగా సాగింది. 30 ఏళ్లుగా నిరంతరంగా కొనసాగిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఏప్రిల్ 14న తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ చేస్తున్నట్లు గెజిట్ లో చేర్చిన సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పుల్లాస్ ఫ్యామిలీ పద్మశ్రీ మందకృష్ణ మాదిగను ఘనంగా సత్కరించారు. ఉద్యమ నాయకులు కళా నేతలు, పృథ్వీరాజ్ యాదవ్, తెలంగాణ విట్టల్, ఇస్మాయిల్ బాయ్, వరంగల్ శ్రీనివాస్, ఏపూరి సోమన్న, మిట్టపల్లి సురేందర్,దరువు అంజన్న, దరువు ఎల్లన్న, అంతర్పుల నాగరాజు, వరంగల్ రవి, రామంచ భరత్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ తదితరులను మందకృష్ణ సత్కరించారు. సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ రేపటి తరానికై మనం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రోజుల్లో రాజ్యాధికారం మనదేనన్నారు. ఈ సభకు ప్రొఫెసర్ పుల్లా శ్రీనివాస్ అధ్యక్షత వహించారు.



## యువత సేవాభావాన్ని అలవర్చుకోవాలి

### ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**కలంజ్యోతి, జగిత్యాల :** రాయికల్ పట్టణంలోని చిన్నజీయర్ స్వామి ట్రస్ట్ భవనాన్ని ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ సందర్శించారు. ప్రతిమ ఫౌండేషన్ సహకారంతో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, హోమ్ ఎయిడ్ హెల్త్, టైలరింగ్ కోర్సుల్లో ఉచిత ఉపాధి శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువతీ, యువకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ పొందుతున్న కోర్సుల్లో వృత్తి నైపుణ్యాలు నేర్చుకుంటూ యువత సేవా భావాన్ని అలవర్చుకుంటే ప్రగతిపథంలో దూసుకెళ్లి అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబడతారన్నారు. శిక్షణ కేంద్రానికి బోరు వెల్, సీసీ రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హనుమాండ్లు, పాక్స్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, జిల్లా స్కిల్ కమిటీ సభ్యులు,ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్ నాగిరెడ్డి రఘుపతి, నాయకులు కోల శ్రీనివాస్, డాక్టర్ మహేందర్ బాబు, మాజీ సర్పంచ్ డాక్టర్ రాజారెడ్డి, జిఎంఆర్ సిబ్బంది ప్రమోద్, నాగేందర్, చిరంజీవి, వనిత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



## శాంతి భద్రతల పరిరక్షణ ప్రధాన ప్రాధాన్యత

### ఎస్పీ అశోక్ కుమార్

**కలంజ్యోతి, జగిత్యాల :** శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతకు ప్రధాన ప్రాధాన్యత అని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల పట్టణంలో అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. రాత్రి సమయంలో నిఘా మరింత పటిష్టం చేస్తూ సమయానుకూల చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నేరాల నియంత్రణకు జగిత్యాల పట్టణంలోని ప్రధాన కూడలు, బస్ స్టాండ్, చౌరస్తాల్లో, రహదారి పాయింట్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరుగుందన్నారు. ఈ సందర్భంగా నిషేధిత మత్తుపదార్థాలు, ఇతర చట్టవిరుద్ధ వస్తువులను గుర్తించేందుకు శిక్షణ పొందిన నార్కోటిక్ డాగ్ స్క్వాడ్లతో , బాంబ్ స్క్వాడ్ సిబ్బందితో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల ముఖ్య ఉద్దేశం.. నేరాలు నివారించడం, నిషేధిత మత్తుపదార్థాల వినియోగం, అక్రమ రవాణా నిరోధించడం,చట్టవిరుద్ధ చర్యలపై పటిష్ట నిఘా పెట్టడం మరియు అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచి వారి వివరాలను అడగడం జరిగిందని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 కి సమాచారం అందించాలని సూచించారు. సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని అదికారులు కోరారు.

4
కలంజ్యోతి
శనివారం 19.04.2025 General News

# నీ అంతు చూస్తాం!

## ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అభిమానుల లేఖ

- మంత్రి పదవి రాకుంటే తడాఖా చూపిస్తామని హెచ్చరిక
- ఎమ్మెల్యే టికెట్ రూ.10 కోట్లు
- మంత్రికి రూ.100 కోట్లు ఖర్చు చేశామని వెల్లడి
- రెడ్డి సామాజిక వర్గ నేతలే అడ్డంకని భావన




**కలంజ్యోతి, హైదరాబాద్ :** మా ఎమ్మెల్యేకు మంత్రి పదవి రాకుండా చేశావో.. నీ అంతు చూస్తామని.. నిన్ను సీఎం పదవి నుంచి దించడం ఖాయం'అని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అనుచరులు బహిరంగ లేఖ విడుదల చేశారు. సీఎం సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో విడుదలైన లేఖ కలకలం సృష్టిస్తున్నది. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వాకిటి శ్రీహరికి మంత్రి పదవి రాకుండా అడ్డుపడుతున్నారన్న ఆరోపణలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, రెడ్డి సామాజికవర్గ మంత్రులను హెచ్చరిస్తూ ఈ లేఖలు గురువారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో కొంతమందికి పోస్ట్ ద్వారా అందాయి. గతంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వొద్దని.. అనేక అక్రమాలకు పాల్పడుతున్నారంటూ కొందరు ఆయనకు వ్యతిరేకంగా సిరీస్ లేఖలు విడుదల చేశారు. తర్వాత ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఖాయమనుకున్నారు. అనూహ్య పరిణామాల నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ వాయిదా పడింది. ఈ క్రమంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సీఎం, మంత్రులను హెచ్చరిస్తూ తాజాలేఖ విడుదలైంది. పోలీసు యంత్రాంగం ఎమ్మెల్యే ఆదేశాలతో వాటిని స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

**లేఖలో ఏముందంటే!**

'రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సీఎం, మంత్రులకు హెచ్చరిక. మేము (ముదిరాజ్ సామాజిక వర్గం) తెలంగాణ జనాభాలో మొదటి స్థానంలో ఉన్నాం. మా సామాజిక వర్గం నుంచి ఒకే ఒక్క ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఎన్నికయ్యారు. మా ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇస్తామని మీరు హామీ ఇచ్చారు. ఇంతవరకు ఊసెత్తడం లేదు. మా ఎమ్మెల్యేకు మంత్రి పదవి రాకుండా మీరు అడ్డుపడుతున్నరు. మా ఎమ్మెల్యేకు టికెట్ మీ దయా దాక్షిణ్యాలపై రాలేదు.. ఆయనపై మల్లికార్జున ఖర్గే ఆశీస్సులున్నాయి. నువ్వు.. నీ సామాజిక వర్గంవారు ఎన్ని జిమ్మిక్కులు చేసినా మంత్రి పదవి ఖాయం. నువ్వు నీలం మధు ముదిరాజ్‌తో కుమ్మక్కై రూ.వంద కోట్ల బేరం కుదుర్చుకుని అతడికి ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇవ్వాలని ప్రయత్నం చేసినవు. ఈ విషయం ఏఐసీసీకి తెలిసి నీకు మొట్టికాయలు వేసింది. ఖబడ్దార్ బిడ్డా.. నీ పలుకుబడి ఉపయోగించి మా ఎమ్మెల్యేకు మంత్రి పదవి రాకుండా చేశావో నీ భరతం పట్టడం ఖాయం. రాష్ట్రంలో కాంగ్రెస్ ఖతం.. నిన్ను సీఎం పదవి నుంచి దించడం అనివార్యం' అని లేఖలో పేర్కొన్నారు.

**మంత్రికి రూ.100 కోట్లు ఖర్చు చేశామని వెల్లడి**

ఎమ్మెల్యేగా ఎవరో దయాతోనే గెలవలేదని వారు తెలిపారు. రూ.10 కోట్లు ఇచ్చి పార్టీ నుంచి ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకున్నామని తెలిపారు. మీరు హామీ ఇచ్చిన మేరకు మంత్రి పదవి కోసం రూ.100 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. ఎవరి దయపైనా ఆధారపడి లేమని, ఆత్మగౌరవంతో రాజకీయాల్లో రాణిస్తున్నామని తెలిపారు.



మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అభిమానుల హెచ్చరిక

మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే గా గెలిచిన వాకిటి శ్రీహరి యొక్క ముదిరాజ్ సామాజిక వర్గ అభిమానులమైన మేము తెలంగాణా రాష్ట్ర రెడ్డి సామాజిక వర్గమునకు చెందిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మరియు రెడ్డి సామాజిక వర్గమునకు చెందిన మంత్రులకు ముఖ్యముగా ఉత్తంకుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మరియు రెడ్డి సామాజిక వర్గమునకు చెందిన ఇతర మంత్రులకు హెచ్చరిక:

మేము రాష్ట్రములో (ముదిరాజ్ సామాజిక వర్గము) తెలంగాణా జనాభాలో మొదటి స్థానంలో ఉన్నాము, మా సామాజిక వర్గమునకు చెందిన ఒకే ఒక్క ఎం.ఎల్.ఎ, శ్రీ వాకిటి శ్రీ హరి ఎన్నిక కావడం జరిగినది. గత ఎలక్షన్ లో మీరు హామీ ఇచ్చినట్లు మా ఎం.ఎల్.ఎ గారికి మంత్రి పదవి ఇస్తామని హామీ యివ్వడం జరిగినది. కాని మీరు ఇంతవరకు మంత్రి పదవి ఊసెత్తడం లేదు, మా ఎం.ఎల్.ఎ గారికి మంత్రి మంత్రి పదవి రాకుండా మీరు అడ్డుపడు చున్నారు. మా ఎం.ఎల్.ఎ గారికి ఎం.ఎల్.ఎ టికెట్ మీ యొక్క దయ దాక్షిణ్యాలపై రాలేదు, అతనికి మల్లికార్జున ఖర్గే యొక్క ఆశిస్సులు పుష్కలంగా ఉన్నవి, టికెట్ కోసం పది కోట్లు యివ్వడం జరిగినది, ఇటీవల ఢిల్లీ పర్యటనలో మంత్రి పదవికోసం దాదాపు యాభై నుండి వంద కోట్లు చెల్లించి మంత్రి పదవి ఖాయం చేసుకోవడం జరిగినది, అంతే తప్ప ఉచితంగా వచ్చినవి కాదు, అయిన కుడా నువ్వు మరియు నీ సామాజిక వర్గం వారు ఎన్ని జిమ్మికులు చేసిన మంత్రి పదవి ఖాయం, ఒకానొక పరిస్థితులలో నువ్వు నీలం మధు ముదిరాజ్ తో కుమ్మక్కై అతనితో వంద కోట్ల బేరం కుదుర్చుకొని అతనికి ఎం.ఎల్.సి. ఇచ్చి మంత్రి పదవి యివ్వాలని ప్రయత్నం చేసినావు, అట్టి విషయం ఎ.ఐ.సి.సి. దగ్గర బహిర్గతం కావడంతో, ఎ.ఐ.సి.సి కి తెలిసి నీకు మొట్టి కాయలు వేసినారు. అక్కడ నీ పప్పులు ఏమి ఉడకలేదు.

ఇట్టి ఉత్తరం ద్వారా మేము ముదిరాజ్ సామాజిక వర్గం వారము మరియు నియోజక కాంగ్రెస్ కార్యకర్తలం **ముఖ్య మంత్రికి రేవంత్ రెడ్డి** హెచ్చరిస్తున్నది ఏమనగా, ఖబర్దార్ బిడ్డా నీ పలుకుబడి ఉపయోగించి మా ఎం.ఎల్.ఎ గారికి మంత్రి పదవి రాకుండా చేశావో అప్పుడు నీ భరతం పట్టడం ఖాయం. అదే జరిగితే రాష్ట్రం అల్లకల్లోలం చేయడం ఖాయం, రాష్ట్రంలో కాంగ్రెస్ ఖతం, నిన్ను ముఖ్యమంత్రి పదవినుండి దించడం అనివార్యం, రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం రావడం ఖాయం, రేవంత్ రెడ్డి గారు ఇప్పటికైనా నువ్వు రెండు మూసుకొని మా ఎం.ఎల్.ఎ కు మంత్రి పదవికి అడ్డు పడవద్దు ఒకవేళ అడ్డుపడిన ఎడల జరిగే పరిణామాలకు నువ్వే పూర్తి బాధ్యత వహించవలెను. ఒకవేళ నీకు దమ్ము ధైర్యం పలుకుబడి ఉంటే మంత్రి పదవికి అడ్డుపడు అప్పుడు **చూపిస్తాం మాయొక్క తడాఖా.**

ఒక వేళ మా ఎం.ఎల్.ఎకు మంత్రి పదవి రాలేని పక్షంలో రాష్ట్రంలో ఎక్కడికక్కడ గల రెడ్డిల భారతం పట్టడం ఖాయం. ఇట్టి హెచ్చరిక బహిర్గతం అయిన కూడా మేము ఎవరికీ బెదరం.

ఇట్లు

మక్తల్ పట్టణ ముదిరాజ్ సంఘం
మక్తల్ మండల ముదిరాజ్ సంఘం
బోయ బొట్టు రవి పట్టణ అధ్యక్షులు
గణేష్ కుమార్ మండల అధ్యక్షులు
మక్తల్ నియోజక వర్గ కాంగ్రెస్ కార్య కర్తలు

నకలు ప్రతులు
1. రాష్ట్ర ముఖ్యమంత్రి గా: ఎనుమల రేవంత్ రెడ్డి
2. ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క గారికి
3. గా:- రాష్ట్ర క్యాబినెట్ మంత్రులకు
4. గా:- రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులకు గాంధీభవన్ హైదరాబాద్




# మోదీ, అమిత్ షా క్షమాపణ చెప్పాలి

**టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

**జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీ**

**కలంజ్యోతి, ఆందోల్ :** ఈ రోజు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నాం అంటే, ఆలాంటి చట్టాలు తీసుకువచ్చిన అంబేద్కర్ మహనీయుడని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గుర్తు చేశారు. సంగారెడ్డి నుంచి మొదలుకొని ఢిల్లీ వరకు దేశ ప్రజలందరూ క్షేమంగా ఉన్నరాంటే ఆనాడు మహనీయులు చేసిన చట్టాలే కారణం అనే విషయం మరువకూడదన్నారు. దేశ ప్రజలందరూ సమానత్వం సాధించాలని, స్వాతంత్ర్యంగా, స్వేచ్ఛగా, ఆర్థిక సమానత్వం ఉండాలని ఆనాడు జవహర్ లాల్ నెహ్రూ ఆధ్వర్యంలో చట్టాలు చేశారన్నారు. ఈ రోజు ఆర్థిక స్వేచ్ఛ, భద్రత, స్వతంత్రంగా, స్వేచ్ఛగా జీవిస్తున్నారంటే బీఆర్.అంబేద్కర్ చేసిన రాజ్యాంగమే కారణమన్నారు. పార్లమెంట్ లో అంబేద్కర్ ను అవమానించేలా అమిత్ షా వ్యవహరించినప్పుడు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారని, అయినా ఇంతవరకూ క్షమాపణ చెప్పలేదని గుర్తుచేశారు. మోదీ, షా క్షమాపణ చెప్పేవరకూ కాంగ్రెస్ పార్టీ వదలదని స్పష్టం చేశారు. త్వరలో సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు ఏమి కోరుకుంటున్నారో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ సహకారంతో అన్ని పనులు చేసి తీరుస్తానన్నారు. కార్యక్రమంలో నిర్మల జగ్గారెడ్డి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్ గేటు వద్ద శుక్రవారం రాత్రి టీ ఎస్ 13 ఈయూ 7878 నంబర్ గల కారు.. బైక్ ను ఢీకొన్న ఘటనలో బాలరాజు (27) మృతి చెందాడు. రెండు వాహనాలు ఎదురు ఎదురుగా ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులలో నాగర్ కర్నూల్ మండలం గన్యాగుల గ్రామానికి చెందిన బాలరాజు మృతి చెందాడు. పెద్దముద్దునూరు గ్రామానికి చెందిన మల్లేష్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. మృతుడు బాలరాజు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో లెక్చరర్ గా పనిచేస్తున్నాడు.

Cinema కలంజ్యోతి
శనివారం 19.04.2025



# నాకు గుడి కట్టండి

బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. తెలుగులో 'వాల్తేరు వీరయ్య', 'స్కంద' వంటి చిత్రాల్లో ప్రత్యేక గీతాల్లో నర్తించి గుర్తింపు పొందిన ఈమె, ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఉత్తర భారతదేశంలో తన పేరు మీద ఒక గుడి ఉందని, అదే విధంగా దక్షిణాదిలో కూడా అభిమానులు తనకు గుడి కట్టాలని కోరుకుంటున్నానని ఆమె పేర్కొనడం వివాదానికి దారితీసింది. ఇటీవల ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఊర్వశి రౌతేలా మాట్లాడుతూ, 'నార్త్ ఇండియాలో నా పేరు మీద ఒక గుడి ఉన్నది. బద్రీనాథ్ టెంపుల్ పక్కన ఉన్న ఊర్వశి టెంపుల్ నా కోసం కట్టారు. అలాగే టాలీవుడ్‌లో చిరంజీవి సినిమాతో ఎంట్రీ ఇచ్చి, వరుసగా స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు రావడంతో నాకు ఇక్కడ కూడా అభిమానులు ఏర్పడ్డారు. ఉత్తరాదిలో లాగే దక్షిణాదిలో కూడా నా అభిమానులు గుడి కట్టాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు క్షణాల్లో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఆమె ఆత్మవిశ్వాసాన్ని ప్రశంసిస్తుండగా, మరికొందరు ఆమె వ్యాఖ్యలు అతిశయోక్తిగా ఉన్నాయని, ఇలాంటి వ్యాఖ్యలు సరికాదని విమర్శిస్తున్నారు. ముఖ్యంగా 'తనకు గుడి కట్టాలి' అని కోరడంపై తీవ్ర స్థాయిలో ట్రోలింగ్ జరుగుతున్నది. గతంలో కూడా ఊర్వశి రౌతేలా కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సందర్భాలున్నాయి. తాను నటించిన సినిమా వంద కోట్లు వసూలు చేసిందని, అదే సమయంలో విడుదలైన కియారా అద్వానీ సినిమా ఫ్లాప్ అయిందని ఆమె చేసిన వ్యాఖ్యలు అప్పట్లో చర్చనీయాంశమయ్యాయి. తాజాగా గుడికి సంబంధించిన వ్యాఖ్యలతో ఆమె మరోసారి వార్తల్లో వ్యక్తిగా నిలిచారు.

